సాధన

ఉదయం తొమ్మిదయిందేమొ. పక్కమీద పడుకునే ఆ రోజు పేపరు చూస్తోంది మధుర. రాత్రి మైమరచి నిద్రపోయినా, యింకా బడలికగానే వున్నదామెకు. చదివేది మనసుకు పట్టకుండా వుంది. పేపరు మడిచి పక్కకు తిరిగి కిటికీ తెర తొలగించి క్రిందకు చూసింది. అది మేడమీది గది. క్రింద తోటకు నీళ్ళు పెడుతున్నాడు మాలి. విచ్చిన పూలతో ఏదో మిన్ను విరిగి నేల ఇంద్ర ధనస్సు క్రిందపడి శకలాలై నలువంకలా చెదరిపోయినట్లుగా వుంది తోట.

నడక చప్పుడుకు వెనక్కి తిరిగింది. “అక్కా; యిదిగో నీకో వుత్తరం” అంటూ ఒక కవర్గు చేతికిచ్చింది చెల్లెలు. చిరునవ్వుతో మధుర కవరు విప్పి చూచుకుంది. “సాయంత్రం ఆరుగంటలకు బీచ్‌కి వస్తానన్నావు కదూ! తప్పకరా నీకో మాంచి కబురు చెప్తాను.” ఇదీ ఆ కాయితం తెచ్చిన కబురు. మధుర సాలోచనగా పక్కమీద కొరిగింది. “పూరెళ్ళి వచ్చివుంటాడు. వాళ్ళ అమ్మతో చెప్పి వుంటాడు. ఆమె అనుకిష్టమై వుంటుంది. అంతకన్నా మంచి కబురు ఇంకేముంటుంది.” అనుకుంది? ఆలోచనలు తెగలేదు. మధ్యాహ్నం భోజనానికి పిలుపు వచ్చాక స్నానం సంగతి గుర్తు వచ్చిందామెకు. గబగబ ఐదు నిమిషాల్లో స్నానం ముగించుకుని భోజనాని కెళ్ళింది. ఏవో పత్రికలు తిరగేస్తూ మధ్యాహ్నం వేగించింది. సాయంత్రం ఐదున్నరకే బీచ్‌కి చేరుకుంది. అంతులేని అసహనంతో అరగంట గడిపింది. అప్పటికి దయచేసిన వాసును చూస్తూ

“…తాలస్యమా?” అంది నిష్ఠురంగా.

"ఏదీ, ఆరూ ఐదేగా" అన్నాడు వాసు మధుర పక్కన కూర్చొని. "చెప్పు, త్వరగా చెప్పు, నన్నాట్టె పూరించకు" అంది మధుర. ఆమె తొందరకు చిన్నగా నవ్వుతూ మెల్లగా అన్నాడతడు. "మొన్న నీకు చెప్పాను. అమెరికన్ స్కాలర్‌షిప్ సంగతి, అది నాకే వచ్చింది."

"నిజం? నేను చెప్పలా నీకే వస్తుందని, నీకే అనుమానంగా వుండెను." "ఔను నాకు ఎక్కువ ఆశ లేకుండెను మధురా, రెండేళ్ళనాడు ఒకరోజున లాబరేటరీలో అనుకున్నాను. 'డాక్టర్ వార్స్‌మన్‌తో కలసి పనిచేయగల్గితే యెంత బాగుండునో' అని. అది నిజమౌతుందని అనుకునే సాహసం లేకపోయింది నాకు. కాని నిజమయింది మధురా, నిజమైంది." అన్నాడు వాసు తన్మయంగా.

"ఎన్నేళ్ళుండా లక్కడ?" మధుర అడిగింది.

"మూడేళ్ళు"

"ఎప్పుడెళ్ళాలి ?"

"ఏదీ, వ్యవధిలేదు. వచ్చే నెలాఖరునే ప్రయాణం కావాలి. ఇంటి కెళ్ళి అమ్మకు చెప్పాలి. అన్నీ సర్దుకోవాలి. ఏమీ తోచకుండావుంది నాకు." అన్నాడు వాసు.

మధుర ముఖం పాలిపోయింది. దీనంగా చూచిం దతనివంక. కాని అతని కాచూపులు చదువుకోగల చాతుర్యం అప్పుడు లేదు. కాసే పాగి "ఎంతలో మూడేళ్ళు. నువ్వుంటావు కదూ! నాకు తెలుసు నువ్వుంటావు" అన్నాడు. మధురకు బాధతో గొంతు పూడుకుపోయింది. అతనడిగిన దానికేమి చెప్పలే దామె. నిముషాలు గంటలై తోచాయి. అతడింకా ఏదైనా మాట్లాడతాడేమోనని కాసేపు ఎదురు చూచింది. కాని అతనికి అతని గొడవ తప్ప యింకో గొడవ పట్టేట్టుగా లేదు. ఇంకాసేపు ఆగితే అతనికి అభిమాన విషయమైన "ఆంటీ బైయాటిక్స్" మీద ఒక ఉపన్యాసం కూడ యివ్వగలడు. అసహనంతో ఆవేదనతో లేచింది మధుర. "ఇక వెళ్తాను, చీకటవుతోంది" అన్నదామె. వాసు పరధ్యానంగా "వెళ్తావా? వూఁ సరే!" అన్నాడు.

ఆ రాత్రి మధురకు కునుకు లేదు. ఎన్ని వూహాలు పెంచుకుంది? ఎంత ఆశగా వెళ్ళిందా సాయంత్రం? తెల్లని వారణాసి నూలు చీర, దాని పైన సరిగ పూలు. ముత్యాలు కుట్టిన నీలిరంగు పట్టు రవిక. ఈవినింగ్ ఇన్ పారిస్ పరిమళాలు. ఎంత తీరికగా కై చేసుకు వెళ్ళింది? ఎందుకూ?" "అతడెక్కడికో వెడ్తున్నాడు, మూడేళ్ళవరకు మళ్ళీరాడు" అనే కబురు తెలిసికోడానికా? అమెరికా వెళ్ళి ఓ డాక్టరేటు తెచ్చుకోడంకన్నా జీవితంలో ఇంకోటి అక్కరలేదనే ముఖంపెట్టాడతడు. అదంతా తన ఎడల నిర్లక్ష్య మనుకున్నదామె. అభిమానం, కోపం ముంచెత్తుక వచ్చాయి ఆమెకు. ఓ హృదయం, మనసిచ్చుకున్న ఒక హృదయం తన కోసం, తనకోసం మాత్రమే స్పందించాలనే కన్నెతనపు తహతహకు దెబ్బ తగిలింది. నిన్న హాయంగా విపులమైన పక్కమీద పడుకొని వెక్కివెక్కి ఏడ్చింది మధుర.

వాసు యీ దేశం వదలి ఆరునెల్లయింది. మధురకు ఒకటి రెండు ఉత్తరాలు వచ్చాయి. ఎంతో ఆశగా విప్పి చదువుకుంది. కాని వాటిలో అమెరికన్ విశ్వవిద్యాలయాల్లోని లాబరేటరీ సౌకర్యాలను గురించిన విశేషాలున్న వేరేమీ లేవు. మధుర పెంచుకున్న అపోహలకవి దోహదా లయ్యాయి. ఆమె జవాబు వ్రాయలేదు. "ఔను నేనే తెలివితక్కువదాన్ని. ఆశలు పెంచుకున్నాను. అతనికి నేనేమీ కాను. నిజంగా అతనికి నేనేమీ కాను" అనుకుంది. అదే నమ్మింది గాఢంగా.

వాసు చిత్రమైన మనిషి. చిన్నతనంనుంచి చదువుతప్ప ఇంకో ధ్యాస లేకుండా పెరిగాడు. "తెలిసికోవాలి" అనే జిజ్ఞాసకన్నా గాఢమైన ఉద్వేగా లతనికి లేవు. "ఒక శాస్త్రజ్ఞుని జీవితం" జీవించడమే అతని జీవలక్షణం. కాని మనస్సుతో ప్రమేయం లేకుండానే ఒక బలహీనమైన క్షణాన వయస్సు తెచ్చిపెట్టిన ఒత్తిడికి ఒకమ్మాయిపైన వలపు కలిగింది. కాని యీ భావమే అతని మనసెల్ల ఆక్రమించుకొన్నది కాకపోవడం, దీనివల్ల అతని జీవలక్షణమైన కోరిక ఏమాత్రం చెదరకపోవడం మధుర దురదృష్టమనే చెప్పాలి.

ఆనాటి సాయంత్రం మధుర తలస్నానం చేసింది. అలసటకు ఒంతా చెమ్మగిలింది. తోటలోకి వెళ్ళింది కాసేపు చల్లగాలికి. దూరంగా

పచ్చికలో దోగాడుతున్న కుందేలు పిల్లను చూస్తు నిలబడిపోయిం దొక చోట. "మధురా, యిక్కడేం చేస్తున్నావమ్మా" అన్న తండ్రిమాట విని వెనక్కి తిరిగింది. తండ్రి ప్రక్కనే ఇంకో క్రొత్త వ్యక్తి! అతని చూపుకు సిగ్గుపడింది మధుర. కన్నార్పకుండా చూస్తే చంద్రుడుకూడ ఏ మబ్బు చాటుకో పోతాడు. ఇహ ఆడపిల్ల సిగ్గుపడిందంటే విచిత్ర మేమిటి?

"ఏంలేదు, వూరికేనే వచ్చాను నాన్నా" అని లోపలికి వెళ్ళిపో యింది. మాట్లాడుతూవస్తున్న తండ్రి కూతురును చాల ఆలస్యంగాచూశాడు కాని, అంతకుముం చెప్పటినుంచో అబ్బాయి కళ్ళన్ని అమ్మాయి మీదే వున్నాయి. అతడు నిర్విణ్ణుడై చూస్తున్నాడామె వంక. ఎవరినిగురించిన వూహలలోనో నడక మరచిపోయిన పాదాలు, ఎవరి పిడికిట్లోనో యిముడ టానికి పడేతాపత్రయంతో సన్నగిలిపోయిన నడుము, ఏకాకినని ఆక్రో శించిన దేనినైనా తమివిగా అల్లుకుపోగల చేతులు, ఎవరి దీనవాక్కు వినో చెమ్మగిలటానికి సిద్ధంగా వున్నట్లు మిలమిల మెరిసే నేత్రాలు, ఎవరి చేతుల పరామర్శకో ఎదురు చూస్తున్న ముంగురులు, ఎవరికారకో వుప్పొంగిపోయిన సౌందర్యం, ఎదురుచూచి, విసిగిపోయి కేశరాశిగా క్రిందకు ప్రవహిస్తోంది. అవ్యక్తమైన విషాదభావమొకటి మధుర ముఖాన్ని మరింత సుందరంగా చేసింది, మధుర రూపం మరుపురాలే దతనికి. "నా అదృష్టాన్ని కొలిచి చూస్తాను!" అనుకున్నాడా యువకుడు.

నెలలు గడుస్తున్నాయి. ఒకనాటి సాయంత్రం మధుర టీ తీసు కుంటోంది. తల్లి వచ్చి ఎదురుగానున్న కుర్చీలో కూర్చుంది. కూతురు వంక నిశితంగా చూస్తు "ఇహ నీ ఆలోచన తెమలదా ఏమిటి? ఎన్నాళ్ళు చూసినా, ఏ మాటా చెప్పవేం! నీ కేదో ఆటగా వున్నట్లుందే చూస్తుంటే!" అన్నది. మధుర కొస్త విరక్తిగా "చెప్పానుగదా నేను, చెప్పిందే మళ్ళీ ఎన్నిసార్లు చెప్పను?" అంది. ఆ తల్లి పూర్తిగా సహనాన్ని కోల్పోయింది కోపం, చిరాకు పట్టలేక "ఏమిటి చెప్పావు నువ్వు? చెప్పేదానికి ఏదైనా అర్థముండాలి. అసలు పెళ్ళే వద్దనడానికి నువ్వొక పెద్ద రాజకుమార్తె ననుకోకు. నీకోసం పోటీలుపడి యుద్ధాలు చెయ్యడానికి రాజకుమా

లెవరూ లేరిక్కడ. ఇహ నీతో వాదించడానికి నాకోపిక లేదు. నా పని నేను చేసుకుపోతాను." ఆమె వెళ్ళిపోయిం దక్కడనుంచి. సగం టీ కప్పులోనే వదిలేసి తన గది కెళ్ళిపోయింది మధుర.

రెండు గదు లవతలనుంచి సంగీతం మాస్టారి గొంతు "అడిగి సుఖము లెవ్వరనుభవించిరి రామ!" చెల్లెలికి పాఠం చెప్తున్నారు. మధురకు మనసంతా వికలమైపోయింది. "ఏం చెయ్యను? ఏం చెయ్యాలి? ఏం చెయ్యగలను? ఒక్క వుత్తరంలోనైనా ఆ సంగతే ఎత్తడే, ఎవరికి ఏమని చెప్పుకుంటాను? ఏ ఆశలూ లేని నిరీక్షణలోకూడ అందమున్నదని ఆత్మవంచన చేసుకోనా?" అనుకుంది. అతడు—'మాధవరా'వట పేరు. ఆనాడు తండ్రితో తోటలో చూసిన్నాడే పసిగట్టిం దతని చూపులను. యూనివర్సిటీలో పనిచేస్తున్నాడట. ఎటామిక్ ఫిజిక్సులో డాక్టరేటట. మధుర నవ్వుకుంది. "హోమ్‌సైన్స్‌లో డిగ్రీ తీసుకున్న నాకు ఏంటీ బైయాటిక్స్ అయితేనేం, ఎటామిక్ ఫిజిక్సయితేనేం అనుకుంది.

పెద్దలు నిశ్చయించిన సుముహూర్తాన మధుర మాధవరావు యిల్లా లయింది. పెండ్లయిన దగ్గరనుంచి ఆమె మనస్సు మరీ చెడింది. గతం ఎప్పుడూ నిజంగా 'గతం' కాదు. తలపుకు వస్తే అది వర్తమానంకన్నా బాధపెడుతుంది. భవిష్యత్తుకన్నా భయపెడుతుంది. ఏదో పాపం చేశానన్న శంకతో వేగిపోతోంది మధుర. విరక్తిగా రోజులు వెళ్ళించడమే తప్ప దేనిపైనా మనసు పోవడం లేదామెకు. మాధవరావు భార్య ప్రవర్తనకు రిచ్చపోయాడు. హోంసైన్స్ గ్రాడ్యుయేటు యింటిని తెలివిగా సవరించబోయి మరింత కంగారుగా చేస్తే అతడాశ్చర్యపడకనేపోవును. కాని యింటి యావే లేని యిల్లాలిని చూసి తెల్లబోయాడతడు. "ఈమె ఏదో యితరులతో పంచుకోలేని బాధపడుతోంది, సరదాకోస మెవరూ సన్యాసం పుచ్చుకోరుగదా! ఏమని అడగను, అడిగినా చెప్తుందా? ఏమిటి చెయ్యటం?" అనుకున్నాడతడు.

ఆ రాత్రి మాధవరావు ఏదో చదువుకుంటున్నాడు. మధుర వెళ్ళి [illegible]కుంది. వెన్నెల పోతపోసిన ప్రతిమలా పడుకుంది. నీలికలువల

శాఖా గ్రంధాలయం, మురపాక. 4872

కళ్ళు, నిద్రకారిపోతున్న కళ్ళు, మెడలో ముత్యాలు ఒరుసుకుపోతున్నాయి. ఆస్వాదన మాసించని పరిమళం. మధుర మైమరచి నిద్ర కొరిగింది. విచలితుడైనాడు మాధవరావు. సౌందర్యం సంపద. దాన్ని గుర్తించటం సంస్కారం. మాధవరావు కాసంస్కారం వుంది. "మనసిచ్చి పలుకనైనా పలుకదే. ఏమిటి ప్రారబ్ధం, ఎన్నాళ్ళీ పొడిబ్రతుకు?" అనుకుని నిట్టూర్చాడతడు. మధుర నిద్రపోయింది. మాధవునకు కునుకు రాలేదు. ఏమాలోచన తట్టిందో తటాలున లేచాడు కుర్చీలోంచి. మధుర సూట్‌కేస్ తెరిచి చూచాడు. వెదకబోయిన తీగ కాలికే తగిలింది. మధుర డైరీ కనబడింది. అంతరాత్మను అణచిపెట్టి, పేజీలు త్రిప్పాడు. వరుసగా చదివాడు. అతని ముఖ మెఱ్ఱబారింది. డైరీ తీసికెళ్ళి మళ్ళీ మధుర పెట్టెలో పెట్టేసాడు. కళ్ళు పెద్దవి చేసుకుని మధురవంక చూసాడు. నిట్టూర్చాడు. "ఓ అమ్మాయీ, నువ్వు నన్నిలా కాల్చుకుతింటానికి నీకేమీ హక్కులేదు. నీ అందానికి నేను ఓడిపొయ్యాను. నిజమేకాని, నా భార్య అందమైనది అనే గర్వం నాకేమీ సుఖాన్నివ్వదు. నాకు జీవితంలో కావలసినది సుఖం. అందుకు నిన్ను నే గెలుచుకోవాలి. సాహసం చేస్తాను. దుస్సాహసమైనా సరే సంకోచంలేదు నాకు" అనుకున్నాడు.

మరునాడు ఆదివారం. నిద్ర లేచేసరికి చాల ప్రొద్దెక్కిపోయింది. తీరిగ్గా కూర్చుని కాఫీ తీసుకుంటున్నాడు.

"నేనెక్కడికైనా రెండేళ్ళపాటు వెళ్తే నువ్వుండగలవా" అన్నాడు మాధవరావు మెల్లగ కాఫీ తాగుతూ. మధుర తెల్లబోయి చూచిన దతని వంక. మాధవరావు చిరునవ్వుతో "పోనీ, రెండేళ్ళుకాదు, ఒక్క ఆరు నెల్లు వుండగలవా? అది చెప్పు" అన్నాడు. మధుర కళ్ళు దించుకుని "నే నెందుకుండాలి, మీ రెక్కడికెళ్తారు, సరిగా చెప్పండి" అంది. "కంగారుపడిపోకు, నే నెక్కడికీ వెళ్ళడంలేదు. నేను వెళ్ళలేను. అందుకే వదులుకున్నాను." అన్నాడు మాధవరావు. "ఏమి వదులుకున్నానంటున్నారు? నాకేమీ అర్థంకావడంలేదు."

"మా ప్రొఫెసరు నన్ను ఏదో శిక్షణపొందటానికి స్కాలర్‌షిప్ యిప్పించి రష్యాకు పంపుతామన్నారు. కాని నేను నా ఆరోగ్యం బాగులేదు. నేనిప్పట్లో ఎక్కడికీ వెళ్ళలేను అని చెప్పాను" అన్నాడు మాధవరావు.

"ఆరోగ్యం బాగులేదా?" ఆదుర్దాగా అడిగింది మధుర. "ఛా, నిజ మనుకున్నావేమిటి? అట్లా చెప్పక మరేమి చెప్పేది?" మధుర ఆశ్చర్యా నికి మేరలేదు. "అదేమిటి ఎందుకట్లా చేసారు?" అన్నది.

"వాళ్ళు నా ఒక్కడి ఖర్చులే భరిస్తారు. నిన్ను తీసికెళ్ళేందుకు నా దగ్గఱ డబ్బులేదు. పదేళ్ళక్రితం నిన్ను చూసివుంటే, నా డబ్బంతా అలా తగలేసేవాణ్ణికాదు. ఇప్పుడెలా వెళ్ళను? ఇంతటి అవకాశం మరి రాకపోదు. మంచిరోజులు వస్తే మనిద్దరం కలిసే వెళ్ళవచ్చును. మధురా! నేను బలహీనుణ్ణి. నన్ను విడచి నువ్వుండగలవేమోగాని, నిన్నువిడచి అన్నాళ్ళు నే నుండలేను" అన్నాడు.

మధుర మ్రాన్పడిపోయింది. "అంతటి అవకాశం అవలీలగ నా నిమిత్తం వదులుకున్నారా యీయన? ఇద్దరికీ ఎంత భేదం?" అనుకున్న దామె. "నువ్వుండగలవేమోగాని" అన్న భర్తమాట ములుకులాగ తగిలిం దామెకు. "మమతలు పెంచుకున్నవాళ్ళు, దాని మాధుర్య మెరిగినవాళ్ళూ యింతకన్నా భిన్నంగా ప్రవర్తించలేరు. అప్పుడు నేను కేవలం మోస పోయాను. నా భ్రమ తొలగిపోయింది. ఇహ నా కర్తవ్య మర్థమయ్యింది నాకు" అనుకుంది మధుర.

'మంచిపనేచేసారు. ఇహనుంచి నన్నడుగకుండ మీరేవో నిర్ణ యాలు చేసేస్తే నేనూరుకొనేది లేదు' అంది మధుర.

మాధవరావు మధురలోని మార్పుని కనిపెట్టాడు. ఎంతో సంబ రంగా "మధురా, సినిమాకు పోదామా?" అన్నాడు.

"మరి ముందే చెప్పారుకారు. వుండండి, క్షణంలో తయారయి వస్తాను" అని లోపలికి వెళ్ళింది మధుర.

"సమయానికి తగుమాట లాడెనె
సాధించెనే ఓ మనసా—"

కూనిరాగం తీసుకుంటూ స్నానానికి వెళ్తున్న భార్యను చూచి మాధవ రావు "ఓ అపరిచితుడా, క్షమించు నన్ను! నేను మనిషిని. స్వార్థాన్ని జయించలేకపోయాను" అనుకున్నాడు.

—o—